విమాన ప్రయాణంతో
అనారోగ్యం!

- అపరిశుభ్రత కారణంగా సీట్లు, ట్రే టేబుళ్ల వంటి వాటిపై బ్యాక్టీరియా, వైరస్‌లు
- కొన్ని రోజుల పాటు వాటిపైనే తిష్ఠ
- డయేరియా, తలనొప్పి, కడుపు నొప్పి వంటి అనారోగ్య సమస్యలకు గురయ్యే చాన్స్
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు

న్యూఢిల్లీ, ఆగస్టు 19: విమాన ప్రయాణం చేస్తున్నారా? ఫ్లైట్‌లో మీరు కూర్చొంటున్న సీటు, సీట్ బెల్ట్, ఆహార పదార్థాలు పెట్టుకొనే ట్రే టేబుల్ వంటివి శుభ్రంగా ఉన్నాయా? లేవా? అని చూసుకొంటున్నారా?. అవి శుభ్రంగా లేకుంటే విమాన ప్రయాణం తర్వాత డయేరియా, తలనొప్పి, కడుపులో నొప్పి వంటి అనారోగ్య సమస్యలకు గురవుతారని జైపూర్‌కు చెందిన సుదీప్తో అనే డాక్టర్ హెచ్చరిస్తున్నారు. విమాన ప్రయాణం పలు అనారోగ్య సమస్యలకు ఎలా దారితీస్తుందో ఆయన తన ఎక్స్ ఖాతాలో వివరించారు. చాలా మంది ఇలాంటి అనారోగ్య సమస్యలతో తన వద్దకు వచ్చారని తెలిపారు. విమానంలో సీట్లు, ట్రే టేబుళ్లు, సీట్ బెల్ట్‌లు, ఆర్మ్ రెస్టులు వంటివి ప్రయాణాల్లో అందరూ సాధారణంగా టచ్ చేసేవి ఉంటాయని, వాటిపై ఉండే బ్యాక్టీరియా, వైరస్‌లు, ఇతర వ్యాధికారకాలు అనారోగ్యం కలిగిస్తాయనే విషయాన్ని పలు అధ్యయనాలు ఇప్పటికే వెల్లడించాయని పేర్కొన్నారు. వెంటనే తిరుగు ప్రయాణం చేయాల్సి రావడం వలన విమానంలో పూర్తిగా శుభ్రం చేసేందుకు అవకాశం ఉండదని, సీట్ల వరకు ఏదో కొంత మేర క్లీనింగ్ చేస్తారని అభిప్రాయపడ్డారు. ప్రధానంగా ఫ్యాబ్రిక్ సీట్లు తేమను పీల్చుకొని ఎక్కువ సేపు ఉంచుతాయని, దీని వలన బ్యాక్టీరియా, వైరస్‌ల బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని వివరించారు. ముఖ్యంగా వేడి వాతావరణంలో ప్రయాణాలు చేసే సమయంలో వ్యక్తి చెమట హెడ్ రెస్టులకు అంటుకుంటుందని చెప్పారు. అదేవిధంగా ప్రయాణికులు దగ్గరదగ్గరగా కూర్చోవడం వలన సూక్ష్మక్రిములు ఒకరి నుంచి మరొకరికి సులభంగా ట్రాన్స్‌ఫర్ అవుతాయని పేర్కొన్నారు. సాధారణ పరిశుభ్రతను పాటించకపోతే ఏ ప్రజా రవాణాలోనైనా అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు.

సీట్లపై వారం రోజుల వరకు బ్యాక్టీరియాలు

డాక్టర్ సుదీప్తో పలు అధ్యయనాలను ప్రస్తావించారు. సెప్టిక్ ఆర్థ్రిటిస్, ప్రాస్టెటిక్ డివైజ్ ఇన్ఫెక్షన్లు, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, గ్యాస్ట్రోఎంటెరిటిస్, మెనిన్‌గిటిస్, టాక్సిక్ షాక్ సిండ్రోమ్, యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లు వంటి వ్యాధులను కలిగించే స్టెఫిలోకాకస్ ఆరియస్ అనే బ్యాక్టీరియా విమాన సీట్లపై ఏడు రోజుల వరకు జీవించి ఉంటుందని 2015లో ఆబర్న్ యూనివర్సిటీ పరిశోధకులు వెల్లడించారని పేర్కొన్నారు. నీళ్ల విరేచనాలకు కారణమయ్యే ఈ.కోలి అనే మరో బ్యాక్టీరియా ఆర్మ్ రెస్టులపై నాలుగు రోజుల పాటు ఉంటుందని తేలిందన్నారు.

ప్రతి దశలోనూ జాగ్రత్తలు తప్పనిసరి

వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలను డాక్టర్ సుదీప్తో ఈ సందర్భంగా సూచించారు. విమాన ప్రయాణ సమయంలో తప్పనిసరిగా హ్యాండ్ శానిటైజర్ తీసుకెళ్లాలని, దాన్ని బోర్డింగ్, సీట్‌లో కూర్చొనే సమయంలో, తర్వాత రాసుకోవాలని అన్నారు. విమానం దిగిన తర్వాత బస్సు లేదా రైలు ప్రయాణంలోనూ ఇది పాటించాలన్నారు. ముఖ్యంగా స్వల్ప దూర దేశీయ ప్రయాణాల్లో విమానంలో పేపర్ కప్పుల్లో ఇచ్చే ఆహారం, నీరు, జ్యూస్‌లను తీసుకోకూడదని సూచించారు. దూర ప్రయాణాల్లో దాహం తీర్చుకొనేందుకు ఒక నీళ్ల బాటిల్ కొనుక్కోవాలన్నారు. కూర్చొనే ముందు సీట్, హ్యాండ్ రెస్ట్‌లు, ట్రే టేబుల్ ఉపరితలాలను డిస్ఇన్ఫెక్ట్ వైప్స్‌తో శుభ్రం చేసుకోవాలని, ఆహారం, పానీయాల విషయంలో విచక్షణ చూపాలని సూచించారు.

ఆమె డైరీలో చిరిగిన పేజీ!

- ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనలో మరో కోణం
- పూర్తి వివరాలు చెప్పని బాధితురాలి తండ్రి
- నేడు నిందితుడికి సీబీఐ 'లై డిటెక్టర్' పరీక్ష!
- సుప్రీంకోర్టు సుమోటో విచారణ కూడా నేడే

కోల్‌కతా: దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిన కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనలో మరో కొత్త విషయాన్ని బాధితురాలి తండ్రి వెల్లడించారు. తన కుమార్తె వ్యక్తిగత డైరీలో ఒక పేజీ చిరిగి ఉన్నదని పేర్కొన్నారు. తన కుమార్తె బ్యాగ్‌లో ఎప్పుడూ ఒక డైరీ ఉంటుందని, దాన్ని తామెప్పుడూ చదవలేదని తెలిపారు. డైరీలో చిరిగిన ముక్కకు సంబంధించిన ఫొటో తన వద్ద ఉందని చెప్పిన బాధితురాలి తండ్రి.. అందులో ఏమున్నదనే వివరాలు వెల్లడించలేదు. కేసుకు సంబంధించిన విషయాలను బహిరంగంగా మాట్లాడొద్దని తనకు సీబీఐ సూచించిందని అన్నారు. కాగా, ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనను సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు.. మంగళవారం విచారణ జరుపనున్నది. మరోవైపు ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌ను సీబీఐ వరుసగా మూడు రోజులు ప్రశ్నించింది. ఘటనకు ముందు, తర్వాత ఆయన ఫోన్స్ కాల్స్‌ను పరిశీలిస్తున్నది.

లై డిటెక్టర్ టెస్టుకు హైకోర్టు అనుమతి

ట్రైనీ డాక్టర్ హత్యాచార నిందితుడికి లై డిటెక్టర్ టెస్ట్ నిర్వహించొచ్చని కలకత్తా హైకోర్టు పేర్కొన్నది. దీంతో కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులు నిందితుడు సంజయ్ రాయ్‌కు మంగళవారం పాలీగ్రాఫ్ టెస్టు నిర్వహించే అవకాశం కనిపిస్తున్నది. లై డిటెక్టర్ టెస్టుకు అనుమతి ఇచ్చిన హైకోర్టు.. తదుపరి విచారణను ఈ నెల 29కు వాయిదా వేసింది.

మమతపై పోస్టు.. విద్యార్థి అరెస్టు

పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీపై వివాదాస్పద పోస్టు పెట్టిన కీర్తి శర్మ అనే విద్యార్థిని కోల్‌కతా పోలీసులు అరెస్టు చేశారు. సోషల్ మీడియాలో మమతకు వ్యతిరేకంగా రెచ్చగొట్టేలా, హింసను ప్రేరేపించేలా పోస్టులు పెట్టాడని పోలీసులు ఆరోపించారు. సీఎం మమతను హత్య చేయాలంటూ ఇతరులను ప్రోత్సహిస్తూ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్టు చేశారని పేర్కొన్నారు. అదేవిధంగా నిందితుడు హత్యాచార బాధితురాలి గుర్తింపు, ఆమె ఫొటోను కూడా బయటపెట్టాడని తెలిపారు.

బాధితురాలి శరీరమంతా గాయాలే!

హత్యాచారానికి గురైన బాధితురాలి శరీరంలో చాలా చోట్ల గాయాలైనట్టు పోస్టు మార్టం నివేదిక వెల్లడించిందని ఎన్డీటీవీ పేర్కొంది. ఆమెను గొంతు పిసికి హత్య చేశారని, లైంగిక దాడి జరిగినట్టు మెడికల్ ఆధారాలు కూడా ఉన్నాయని నివేదిక కాపీని ఉటంకిస్తూ పేర్కొన్నది. అయితే బాధితురాలి శరీరంలో 150 జీఎం/ఎంజీ వీర్యం ఉందని జరుగుతున్న ప్రచారాన్ని రిపోర్టు తిరస్కరించింది. ఆమె శరీరంలో 'తెల్లటి చిక్కని జిగురు వంటి ద్రవం' ఉన్నట్టు గుర్తించినట్టు తెలిపిన పోస్టు మార్టం నివేదిక, అది ఏంటో వెల్లడించలేదు. బాధితురాలికి తల, పెదవులు, ముక్కు, బుగ్గలు, కుడి దవడ, గడ్డం, మెడ, ఎడమ చేయి, ఎడమ భుజం, ఎడమ మోకాలుతో పాటు జననాంగం లోపల కూడా గాయాలు అయ్యాయని నివేదిక తెలిపింది. ఊపిరితిత్తుల్లో రక్తస్రావం అయిందని, శరీరంలోని ఇతర భాగాల్లో బ్లడ్ క్లాట్స్ అయిందని పేర్కొన్నది.

ఆర్‌జీ కర్ దవాఖానలో ఏర్పాటు చేసిన బాధిత విద్యార్థిని బొమ్మకు వైద్యుల నివాళి

కేంద్ర దవాఖానల్లో 25% భద్రతా సిబ్బంది పెంపు

న్యూఢిల్లీ, ఆగస్టు 19: కోల్‌కతా రేప్ ఘటనపై నిరసనలు వెల్లువెత్తుతున్న తరుణంలో తమ ప్రభుత్వ దవాఖానల్లో 25 శాతం భద్రతా సిబ్బందిని పెంచుతూ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. అవసరాన్ని బట్టి మార్షల్స్ సంఖ్యనూ పెంచాలని ఆదేశాల్లో పేర్కొంది. వైద్యుల సమస్యలపై సలహాలు స్వీకరించేందుకు డీజీహెచ్ఎస్ అధ్యక్షతన ఒక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పింది. వైద్యుల కోసం విశ్రాంతి గది, సీసీటీవీ లాంటి సౌకర్యాలను ఏర్పాటు చేస్తామని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. దవాఖానల్లో హింసాత్మక ఘటనలు జరిగితే ఆరు గంటల్లోగా ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని తెలిపింది. మరోవైపు సోమవారం పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వ దవాఖానల్లో జూనియర్ డాక్టర్లు కోల్‌కతా రేప్ ఘటనపై నిరసనలు కొనసాగించారు. న్యాయం జరిగే వరకు నిరసన కొనసాగిస్తామని తెలిపారు.

బాలికను నిర్బంధించి.. 5 రోజులు గ్యాంగ్ రేప్

న్యూఢిల్లీ: అరుణాచల్‌ప్రదేశ్‌లో దారుణ ఘటన చోటుచేసుకున్నది. 13 ఏండ్ల బాలికను ఐదు రోజులపాటు నిర్బంధించి ఐదుగురు యువకులు సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. అప్పర్ సుబన్‌సిరి జిల్లా డపోరిజో పట్టణంలో ఈ ఘటన చోటుచేసుకున్నది. పోలీసు సూపరింటెండెంట్ ఘూటన్ జంబ ఆదివారం మాట్లాడుతూ, ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్టు తెలిపారు. కోర్టు వీరికి జ్యుడిషియల్ కస్టడీ విధించిందన్నారు. వీరంతా 20-30 ఏళ్ల మధ్య వయస్కులని చెప్పారు.

13 మంది బాలికలపై లైంగిక వేధింపులు

ఎన్‌సీసీ క్యాంప్ పేరుతో అకృత్యం

తమిళనాడులో ఆలస్యంగా వెలుగులోకి

చెన్నై: తమిళనాడులో కృష్ణగిరి జిల్లాలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటు చేస్తామని నమ్మబలికిన నిందితులు.. ఓ బాలికపై లైంగిక దాడి చేయడంతో పాటు మరో 12 మందిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. ఈ నెల మొదటి వారంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పాఠశాల ప్రిన్సిపాల్, ఇద్దరు టీచర్లతో సహా 11 మందిని అరెస్టు చేసినట్టు పోలీసులు సోమవారం వెల్లడించారు. ఎన్‌సీసీ క్యాంపు సందర్భంగా బాలికలకు స్కూల్ ఆడిటోరియంలో, బాలురకు గ్రౌండ్ ఫ్లోర్‌లో వసతి ఏర్పాటు చేశారు. పిల్లలను పర్యవేక్షించేందుకు ఒక్క టీచర్‌ను కూడా నియమించలేదు. దీన్ని అదునుగా తీసుకొన్న నిందితులు ఓ బాలికపై లైంగిక దాడి చేయడంతో పాటు మరో 12 మందిపై వేధింపులకు పాల్పడ్డారు. నిందితులపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. తమపై లైంగిక వేధింపులు జరిగిన విషయాన్ని బాధిత బాలికలు స్కూల్ యాజమాన్యానికి తెలిపారని, అయితే వారు పోలీసులకు సమాచారం అందించకుండా తొక్కిపెట్టే ప్రయత్నం చేశారని కృష్ణగిరి జిల్లా ఎస్పీ పీ తంగదురై తెలిపారు.

యూపీలో దళిత నర్సుపై రేప్

మొరాదాబాద్: యూపీలోని మొరాదాబాద్‌లో ఓ దళిత నర్సుపై(20) ఆమె పనిచేస్తున్న ప్రైవేట్ దవాఖాన వైద్యుడు లైంగిక దాడి చేశాడని పోలీసులు వెల్లడించారు. బాధితురాలు ఆదివారం విధులకు వెళ్లారు. అర్ధరాత్రి మెహనాజ్ అనే నర్సు బలవంతంగా ఆమెను దవాఖానలోని మొదటి అంతస్తులోని ఒక గదిలోకి తీసుకెళ్లి తాళం వేశారు. అనంతరం షానవాజ్ ఆ గదిలోకి వెళ్లి నర్సును రేప్ చేశాడు. కులం పేరుతో దూషించి, చంపేస్తానని బెదిరించాడు.

23న ఉక్రెయిన్‌కు ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 19: ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 23న ఉక్రెయిన్‌లో పర్యటించనున్నారు. ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ కోరిక మేరకు ఈ పర్యటన ఖరారైందని విదేశాంగ శాఖ సోమవారం తెలిపింది. ఈ నెల 21న మోదీ పోలెండ్‌ను సందర్శించి ఆ దేశ ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో సమావేశమవుతారని చెప్పింది. 30 ఏండ్లుగా ఉక్రెయిన్-భారత్ మధ్య దౌత్య సంబంధాలు కొనసాగుతున్నాయని.. ఆ దేశంలో పర్యటించనున్న తొలి భారత ప్రధాని మోదీనేనని విదేశాంగ శాఖ వెల్లడించింది.

రష్యాలో కేరళ యువకుడి మృతి

బలవంతంగా ఆ దేశ మిలటరీలో ఉద్యోగం

తిరువనంతపురం: ఉక్రెయిన్ సైనిక బలగాలు జరిపిన దాడుల్లో కేరళ యువకుడు రష్యాలో మరణించాడు. రష్యా మిలటరీ తరపున పనిచేస్తున్న త్రిస్సూర్‌కు చెందిన సందీప్ (36), ఉక్రెయిన్ యుద్ధంలో మరణించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. విదేశాల్లోని మలయాళీ సంఘాల నుంచి సందీప్ కుటుంబానికి ఈ మేరకు సమాచారం అందింది. రెస్టారెంట్‌లో ఉద్యోగం లభించిందని సందీప్ ఈ ఏడాది ఏప్రిల్‌లో మాస్కోకు చేరుకోగా, బలవంతంగా అతడ్ని ఆ దేశ మిలటరీలో చేర్చారని స్థానికులు చెబుతున్నారు. రష్యాలో ఉద్యోగాలంటూ ఏజెంట్లు చేస్తున్న మోసాలకు కేరళ సహా వివిధ రాష్ట్రాలకు చెందిన యువకులు బలవుతున్నారు.

మలయాళ సినీ పరిశ్రమలో మహిళలపై వేధింపులు

జస్టిస్ హేమ కమిటీ నివేదిక

తిరువనంతపురం: మలయాళం సినిమా పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై జస్టిస్ హేమ కమిటీ నివేదిక సంచలన విషయాలను వెల్లడించింది. ఇండస్ట్రీలో మహిళా ప్రొఫెషనల్స్ లైంగిక వేధింపులు, దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నది. అమానవీయ ప్రవర్తనకు బాధితులుగా ఉన్నారని తెలిపింది. ఇండస్ట్రీని కొంత మందితో కూడిన ఒక 'క్రిమినల్ గ్యాంగ్' నియంత్రిస్తున్నదని పేర్కొన్న కమిటీ.. లొంగని మహిళలను ఇండస్ట్రీ నుంచి బయటకు పంపేస్తారని వెల్లడించింది. కొంత మంది ప్రొడ్యూసర్లు, డైరెక్టర్లు, నటులు, ప్రొడక్షన్ కంట్రోలర్స్ మధ్య ఒప్పందం ఉన్నదని కమిటీ నివేదిక ఆరోపించింది. 2017లో ఓ నటిపై దాడి కేసు తర్వాత ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసింది.

ఏచూరికి అస్వస్థత

న్యూఢిల్లీ, ఆగస్టు 19: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న ఆయన్ని సోమవారం ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేర్చారు. ఏచూరి గత కొంతకాలంగా నిమోనియాతో బాధపడుతున్నారని, ప్రస్తుతం ఆయన్ని దవాఖానలోని అత్యవసర విభాగంలో చేర్చామని ఎయిమ్స్ వర్గాలు తెలిపాయి. వైద్య పరీక్షల నిమిత్తం ఎయిమ్స్‌కు వచ్చిన ఏచూరి, నిమోనియా తగ్గకపోవటంతో దవాఖానలో చేరారని పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందన్నారు. కొద్ది రోజుల క్రితమే ఏచూరి కంటి శుక్లాల ఆపరేషన్ చేయించుకున్నారు.

బ్రిటన్‌లో అదుపు తప్పిన వీర్యదానం!

- విదేశాలకు సైతం ఎగుమతి
- డజన్ల కొద్దీ తోబుట్టువులు ఉండే అవకాశం: నివేదిక

లండన్: సంతానలేమితో బాధపడే వారికి సంతానం కలిగించే వీర్యదాన ప్రక్రియ బ్రిటన్‌లో అదుపు తప్పింది. బ్రిటన్ నుంచి విదేశాలకు వీర్యం ఎగుమతి అవుతున్నది. బ్రిటన్‌లోని నిబంధనల ప్రకారం ఒకరి వీర్యం పది కుటుంబాలకు మించి ఇవ్వడానికి వీలు లేదు. అయితే, ఎగుమతుల విషయంలో మాత్రం నిర్దిష్ట పరిమితి లేదు. బ్రిటన్ చట్టాల్లోని ఈ లోపాలను ఆసరాగా చేసుకొని వీర్యదానాన్ని పారిశ్రామిక స్థాయిలో చేపడుతున్నారట. దీంతో కొందరికి బ్రిటన్‌లో, విదేశాల్లో ఒక్కొక్కరికి డజన్ల కొద్దీ తోబుట్టువులు ఉండే అవకాశం ఉందని తాజాగా ఓ నివేదిక పేర్కొన్నది. ఈ మేరకు 'గార్డియన్' వార్తా పత్రికలో ఒక కథనం ప్రచురితమైంది. దీని ప్రకారం.. గతంలో బ్రిటన్‌కు అమెరికా, డెన్మార్క్ వంటి దేశాల నుంచి వీర్యం, అండాలు దిగుమతి అయ్యేవి. తర్వాత పరిస్థితి పూర్తి భిన్నంగా మారింది. 2019 నుంచి 2021 మధ్యనే యూకే నుంచి విదేశాలకు 7,542 స్ట్రాల వీర్యం ఎగుమతి అయ్యింది.

ముగిసిన అమర్‌నాథ్ యాత్ర

మంచు లింగాన్ని దర్శించుకున్న 5 లక్షల మంది భక్తులు

న్యూఢిల్లీ: అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య గత 52 రోజులుగా సాగిన అమర్‌నాథ్ యాత్ర సోమవారం శ్రావణ పూర్ణిమతో ముగిసింది. ప్రకృతి వైపరీత్యాలు, భారీ వర్షాలు, ఉగ్రదాడుల్ని సైతం లెక్కచేయకుండా అయిదు లక్షల మంది భక్తులు మంచు లింగాన్ని దర్శించుకున్నారు. ఈ ఏడాది జూన్ 29న యాత్ర మొదలైంది. రెండు మాసాలు మాత్రమే దర్శనమిచ్చే మంచు లింగాన్ని సాక్షాత్తు కైలాస నాథుడు పరమేశ్వరుడిగా భక్తులు భావిస్తారు.

ఎంపాక్స్‌పై కేంద్రం అప్రమత్తం

న్యూఢిల్లీ, ఆగస్టు 19: ఎంపాక్స్‌పై కేంద్రం అప్రమత్తమైంది. బొబ్బలు, పొక్కులున్న రోగులను గుర్తించి ఐసొలేషన్ వార్డుల్లో ఉంచాలని దవాఖానలను కేంద్ర ఆరోగ్య శాఖ ఆదేశించింది. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్, లేడీ హార్డింగ్, రామ్ మనోహర్ లోహియా దవాఖానలను నోడల్ హాస్పిటల్స్‌గా ప్రకటించింది. అనుమానిత రోగులకు ఆర్‌టీ-పీసీఆర్, నాసల్(ముక్కు) స్వాబ్ పరీక్షలు నిర్వహించనున్నారు. విమానాశ్రయాల్లోనూ ముందుజాగ్రత్త చర్యలు తీసుకోనున్నారు.



ఆర్మీ మాజీ చీఫ్ పద్మనాభన్ కన్నుమూత

చెన్నై: భారత సైన్యం మాజీ చీఫ్ జనరల్ సుందరరాజన్ పద్మనాభన్ (83) సోమవారం కన్నుమూశారు. వృద్ధాప్య కారణాల వల్ల ఆయన తుది శ్వాస విడిచినట్లు సమాచారం. ఆయన 2000 సెప్టెంబరు 30 నుంచి 2002 డిసెంబరు 31 వరకు ఆర్మీ చీఫ్‌గా పని చేశారు. 15 కోర్ కమాండర్‌గా ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా అతి విశిష్ట్ సేవా పతకాన్ని ప్రభుత్వం ప్రదానం చేసింది.

ల్యాటరల్ ఎంట్రీపై వివాదం

- ఎన్డీఏకు స్వపక్షంలోనే వ్యతిరేకత
- తప్పుబట్టిన కేంద్రమంత్రి పాశ్వాన్
- రిజర్వేషన్లను లాక్కునే కుట్ర అంటూ విపక్షాల ధ్వజం
- యూపీఏ హయాంలోనే ప్రతిపాదన: కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వంలోని 45 కీలక పదవుల్లోకి కాంట్రాక్టు పద్ధతిలో ప్రైవేటు వారిని నియమించడానికి యూపీఎస్సీ జారీ చేసిన 'ల్యాటరల్ ఎంట్రీ' ప్రకటన వివాదాస్పదమవుతున్నది. ఈ ప్రకటనను కేంద్రమంత్రి, ఎన్డీఏ భాగస్వామ్య లోక్ జనశక్తి పార్టీ(రామ్ విలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్‌తో పాటు ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. సోమవారం ఈ విషయమై చిరాగ్ పాశ్వాన్ స్పందిస్తూ.. ల్యాటరల్ ఎంట్రీ ప్రకటన పూర్తిగా తప్పని, ఇందులో ఎలాంటి 'అయినా, కానీ'లు లేవని కుండబద్దలు కొట్టారు. తమ పార్టీ ఈ చర్యను పూర్తిగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. అన్ని ప్రభుత్వ నియామకాలు రిజర్వేషన్ నిబంధనలను పాటిస్తూ చేయాల్సిందేనని స్పష్టం చేశారు. తనకు ఈ ప్రకటన గురించి ఆదివారమే తెలిసిందని, తన ఆందోళనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు.

రిజర్వేషన్లు లాక్కునే కుట్ర: ప్రతిపక్షాలు

ల్యాటరల్ ఎంట్రీ పద్ధతి ద్వారా నియామకాలు చేపట్టడం దళిత, ఓబీసీ, ఆదివాసీలపై దాడి అని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. బహుజనుల నుంచి రిజర్వేషన్లు లాక్కోవాలని, రాజ్యాంగాన్ని ధ్వంసం చేయాలని బీజేపీ వక్రీకరించిన రామరాజ్యం ప్రయత్నిస్తున్నదని పేర్కొంటూ ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల నుంచి వెనుకబడిన వర్గాలను తొలగించేందుకు ఇది పక్కా ప్రణాళికతో చేస్తున్న కుట్ర అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. బీఎస్పీ అధినేత్రి మాయావతి, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ సైతం ల్యాటరల్ ఎంట్రీ విధానాన్ని తప్పుపట్టారు. ఈ విమర్శలపై స్పందించిన కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్.. ఈ విధానాన్ని యూపీఏ ప్రభుత్వ హయాంలో రెండో అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ కమిషన్ ప్రతిపాదించిందని పేర్కొన్నారు.

ల్యాటరల్ ఎంట్రీ అంటే?

కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో మధ్య స్థాయి, సీనియర్ స్థాయి పదవులను సాధారణంగా ఐఏఎస్ వంటి సివిల్ సర్వీసుల అధికారులతో భర్తీ చేస్తారు. ఈ పదవులను సివిల్ సర్వీసులతో సంబంధం లేని బయటి వ్యక్తులు, నిపుణులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయడాన్నే 'ల్యాటరల్ ఎంట్రీ' అంటారు. మూడేండ్లు లేదా ఐదేండ్ల ఒప్పందంతో వీరిని నియమిస్తారు. ఈ పద్ధతిని 2018లో మొదటిసారి అమలు చేశారు. ప్రస్తుతం పలు విభాగాల్లో జాయింట్ డైరెక్టర్, డైరెక్టర్, డిప్యూటీ సెక్రటరీ తదితర 45 పదవులను భర్తీ చేయడానికి యూపీఎస్సీ ప్రకటన జారీ చేసింది.

'ట్రిపుల్ తలాక్'తో వివాహ వ్యవస్థకు ప్రమాదం

రద్దును సమర్థించుకున్న కేంద్రం సుప్రీంకోర్టులో అఫిడవిట్

న్యూఢిల్లీ, ఆగస్టు 19: వివాహ వ్యవస్థకు ''ట్రిపుల్ తలాక్' అనేది ప్రమాదకరమైన ఆచారమని కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నది. ట్రిపుల్ తలాక్ రద్దును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై కేంద్రం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. 2017లో ఈ ఆచారాన్ని సుప్రీంకోర్టు పక్కకు పెట్టినప్పటికీ అది ట్రిపుల్ తలాక్‌తో చేసుకునే విడాకులను తగ్గించేందుకు సరైన నిరోధకత కాలేకపోయిందని తెలిపింది. ట్రిపుల్ తలాక్ ద్వారా విడాకులు పొందుతున్న ముస్లిం వివాహితల హక్కులను కాపాడేందుకు పార్లమెంటు ఈ చట్టం చేసినట్టు పేర్కొన్నది. ఈ చట్టం ముస్లిం వివాహితలకు లింగ సమానత్వం, న్యాయం కల్పిస్తున్నదని, వివక్షను రూపుమాపేందుకు, వారి సాధికారతకు ప్రాథమిక హక్కులను కాపాడుతున్నదని తెలిపింది. 2017 ఆగస్టు 22న ట్రిపుల్ తలాక్‌ను రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు ప్రకటించింది. తర్వాత కేంద్రం ముస్లిం మహిళా(వివాహంపై హక్కుల రక్షణ) చట్టం చేయగా, పలు ముస్లిం సంస్థలు ఇది రాజ్యాంగ విరుద్ధమని కోర్టును ఆశ్రయించాయి.

సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వీరమరణం

- జమ్ముకశ్మీర్‌లో మళ్లీ ఉగ్రదాడి
- ఈ ఏడాది ఇప్పటివరకు 21 మంది సైనికుల మృతి

జమ్ము: జమ్ముకశ్మీర్‌లో వరుస దాడులతో ఉగ్రవాదులు రెచ్చిపోతున్నారు. సోమవారం ఉదంపూర్ జిల్లాలో గస్తీ నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలపై ఉగ్రదాడి జరిగింది. ఉగ్రవాదుల కాల్పుల్లో సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కుల్‌దీప్ కుమార్ మరణించాడని అధికారులు వెల్లడించారు. బసంత్‌గఢ్‌లోని దూదే ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం లోకల్ పోలీసులతో కలిసి గస్తీగా వెళ్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలపై ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులకు తెగబడ్డారని చెప్పారు. కాల్పుల్లో సీఆర్‌పీఎఫ్ 187వ బెటాలియన్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్‌కు బుల్లెట్ గాయాలయ్యాయని, దవాఖానకు తరలిస్తుండగా ఆయన మార్గం మధ్యలోనే ప్రాణాలు కోల్పోయారని అధికారులు తెలిపారు. జమ్ము రీజియన్‌లో ఉగ్రవాదాన్ని పెంచేందుకు పాకిస్థాన్ గత కొంతకాలంగా తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నది. ఐదు రోజుల క్రితం దోడా జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఆర్మీ కెప్టెన్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఏడాది ఇప్పటివరకు ఉగ్రదాడుల్లో మొత్తం 74 మంది ప్రాణాలు కోల్పోగా, ఇందులో 21 మంది భద్రతా బలగాలకు చెందినవారు కాగా, 35 మంది టెర్రరిస్టులున్నారు.

'రిటైల్'లో 26 వేల ఉద్యోగాల కోత

తక్కువ డిమాండ్, విస్తరణ లేకపోవడం వల్లే

న్యూఢిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరంలో దేశంలో డజనుకు పైగా రిటైల్ కంపెనీలు 26 వేల మంది ఉద్యోగులను తొలగించాయి. లైఫ్ స్టైల్, కిరాణా, క్విక్ సర్వీస్ రెస్టారెంట్‌లు ఈ జాబితాలో ఉన్నాయి. వ్యాపార డిమాండ్ తక్కువగా ఉండటం, స్టోర్ల విస్తరణ నెమ్మదిగా చేయడం వల్ల ఉద్యోగాల్లో కోతలు విధించాల్సి వచ్చిందని ఆయా కంపెనీలు తెలిపాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ రిటైల్ విభాగం, టైటాన్, రేమండ్, పేజ్ ఇండస్ట్రీస్, స్పెన్సర్ ఉద్యోగులను ఎక్కువగా తొలగించిన కంపెనీల జాబితాలో ఉన్నాయి. మొత్తం ఉద్యోగుల్లో 17 శాతం మందిని ఈ కంపెనీలు తొలగించాయి. మరోవైపు కోతలపై రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సీఈవో కుమార్ రాజగోపాలన్ మాట్లాడుతూ.. 'ప్రతిభకు కొరత ఉంది. ఈ విషయంలో మేము విశ్వవిద్యాలయాలతో కలిసి పని చేస్తున్నాం. వ్యాపారాలను మూసేయడం వల్ల కొన్ని కంపెనీలు ఉద్యోగులను తగ్గిస్తున్నాయి. అయితే షాపర్స్ స్టాప్, ట్రెంట్ లాంటి కంపెనీలు స్టోర్ల విస్తరణ చేపడుతూ అదనపు సిబ్బందిని నియమించుకుంటున్నాయి' అని తెలిపారు. ద్రవ్యోల్బణం, పెరుగుతున్న వడ్డీ రేట్లు, స్టార్టప్, ఐటీ రంగాల్లో ఉద్యోగాల కోత, ఆర్థిక మందగమనం వల్ల అత్యవసరం కాని వస్తువుల కొనుగోళ్లు 2022 నుంచి తగ్గాయని ఓ నివేదిక తెలిపింది.

కర్ణాటకలో '108' స్కామ్

- ధనార్జనే లక్ష్యంగా ఆగడాలు.. రోగుల ప్రాణాలు గాలికి
- ఎక్కువ బిల్లుల కోసం ఐదారు అంబులెన్స్‌ల మార్పు
- కొత్త టెండర్లు పిలుస్తామని చేతులు దులుపుకొన్న మంత్రి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

బెంగళూరు, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌పాలిత కర్ణాటక స్కామ్‌లకు అడ్డాగా మారిపోయింది. ముడా, వాల్మీకి, వక్ఫ్‌బోర్డ్ స్కామ్‌లతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న సిద్ధరామయ్య సర్కారుకు '108 ఆరోగ్య కవచ్' అంబులెన్స్ సేవల్లో జరుగుతున్న అక్రమాలు మరో తలనొప్పిగా మారాయి. '108 ఆరోగ్య కవచ్' స్కామ్‌గా పిలుస్తున్న ఈ అక్రమాలకు కారణమైన బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని పెద్దయెత్తున డిమాండ్లు వస్తున్నాయి.

ఏమిటీ స్కామ్?

రోగులను కొంతదూరం ఒక అంబులెన్స్‌లో ఆ తర్వాత మరో అంబులెన్స్‌లో అనంతరం ఇంకో అంబులెన్స్‌లో తరలిస్తున్న ఘటనలు రాష్ట్రంలో ఇటీవల పెద్దయెత్తున వెలుగులోకి వచ్చాయి. ఎక్కువ బిల్లులు రాబట్టడం కోసమే ఇలా చేస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

బయటపడింది ఇలా..

చిత్రదుర్గకు చెందిన సయ్యద్ ఇఫ్తిఖార్‌కు గత నెల 19న గుండెపోటు వచ్చింది. మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని జయదేవ దవాఖానకు తరలించాలని వైద్యులు సూచించారు. దీంతో సయ్యద్ సోదరుడు ముంతాజ్ 108 సర్వీసుకు ఫోన్ చేశాడు. గంట తర్వాత వచ్చిన అంబులెన్స్ డ్రైవర్ ఇఫ్తిఖార్‌ను ఎక్కించుకొని 20 కిలోమీటర్ల దూరం వరకు తీసుకెళ్లి అక్కడే రోడ్డుపై నిలిపేశాడు. అదేమిటని ప్రశ్నిస్తే, మా కంపెనీ నిబంధనలు ఇంతే.. ఇంకో అంబులెన్స్ వచ్చేవరకూ వేచి ఉండండి అని బదులిచ్చాడు. అలా ఆరు గంటల్లో ఆరు అంబులెన్స్‌లను మార్చారు. చివరకు దవాఖానలో చేరిన ఇఫ్తిఖార్ పరిస్థితి అత్యంత విషమంగా తయారైంది. దీనికి సంబంధించిన వీడియో వైరల్ కావడంతో అసలు విషయం బయటపడింది. ఆగస్టు 5న కూడా ఓ గర్భిణికి ఇలాంటి పరిస్థితే ఎదురైంది. దీంతో ఆమె పురిట్లోనే బిడ్డను కోల్పోయింది. అంబులెన్స్‌ల మార్పుతో ఎక్కువ రోగులకు సేవలు అందించామని చూపించి.. ఎక్కువ బిల్లులు వసూలు చేయడానికే ఇలా చేస్తున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు. *108* సేవలను అందిస్తున్న ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసులో పనిచేస్తున్న కొందరు అక్రమార్కుల వల్లే ఇదంతా జరుగుతున్నట్టు మండిపడుతున్నారు. ఈ విషయం తమ దృష్టికి వచ్చిందన్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండురావు.. త్వరలోనే కొత్త టెండర్లను ఆహ్వానిస్తామని చెప్పారు. అయితే, ఈ స్కామ్‌లో ప్రభుత్వ పెద్దల పాత్ర కూడా ఉండొచ్చన్న ఆరోపణలు వస్తున్నాయి.



29 వరకు సిద్ధరామయ్యపై చర్యలొద్దు

'ముడా'పై హైకోర్టు ఆదేశం

బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై ఆరోపణలు ఉన్న 'ముడా' కుంభకోణంలో విచారణను ఆగస్టు 29 వరకు వాయిదా వేయాలని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టును కర్ణాటక హైకోర్టు ఆదేశించింది. ఈ కేసులో సిద్ధరామయ్యపై విచారణకు గవర్నర్ ఉత్తర్వులు ఇవ్వడాన్ని ఆయన హైకోర్టులో సవాల్ చేశారు. గవర్నర్ మంత్రిమండలి సలహా తీసుకోలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. గవర్నర్ ఉత్తర్వులను కొట్టేయాలని కోరారు. అయితే, సిద్ధరామయ్య విజ్ఞప్తి చేసినట్టుగా ఇప్పుడు గవర్నర్ ఉత్తర్వులను నిలిపివేస్తూ ఆర్డర్ ఇవ్వడం లేదని హైకోర్టు తెలిపింది.